క్లుప్తంగా

ఏకగ్రీవంగా పాల్మన్‌పేట సహకార సంఘం ఎన్నిక



ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట: మండలంలో పాల్మన్‌పేట గ్రామంలో రామాంజనేయ మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎ–91 ఎన్నికలు సోమవారం నిర్వహించారు. మొత్తం 195 మంది సభ్యులకుగాను 42 మంది పాల్గొన్నారు. వీరందరూ కలిసి ఏడుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా కందాల లక్ష్మి, వైస్ ప్రెసిడెంట్‌గా గరికిన దొండెమ్మ, డైరెక్టర్లుగా గరికిన రాణి, ముత్తి నూకరత్నం, గోసల మంగ, గోసల సత్యవతి, గవల భారతి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన టి.నాగమణి వారికి నియామక పత్రాలు అందించారు. ఎన్నికల సహాయకులుగా వీఎఫ్‌ఎలు జె.పూర్ణిమ (పాల్మన్‌పేట), వై.లహరి (పాత్తేరు), సత్యనారాయణ (సాగరమిత్ర) పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు జరిగాయి.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి రూరల్: స్థానిక సబ్ స్టేషన్ పరిధి 11కేవీ రాంబిల్లి రూరల్ ఫీడర్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులకు సంబంధించి మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పలు గ్రామాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ (ఆపరేషన్స్) రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, యలమంచిలి, యర్రవరం, కొత్తపాలెం వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలి



శ్రీకృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. స్థానిక సంతబయిల శ్రీకృష్ణుని ఆలయ మొదటి వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలను సందర్శించడం ద్వారా మానసిక ప్రశాంతతతోపాటు ఉల్లాసంగా ఉండగలమన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు, రాజాన బుజ్జి, మెలిపాక సర్పంచ్ అయినంపూడి విజయభాస్కరరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షణ్ముఖనాయుడు కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: నెల్లూరు జిల్లా బీచ్‌లో ఇటీవల మృతి చెందిన మెడికో విద్యార్థి పెంటకోట షణ్ముఖనాయుడు కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను షణ్ముఖనాయుడు తల్లిదండ్రులు కాశీ–మాధవిలను అడిగి తెలుసుకున్నారు. ఎంతో భవిష్యత్ ఉన్న మెడికో విద్యార్థి మృతి విచారకరమన్నారు. వారికి ధైర్యం చెప్పి సంతాపం తెలిపారు.

శ్రీ కృష్ణుని ఆలయాభివృద్ధికి విరాళం



రూ.50 వేల విరాళం అందజేస్తున్న విజయ్, అజయ్ సోదరులు

మునగపాక: శ్రీకృష్ణుని ఆలయాభివృద్ధికి దాతలు అవసరమయ్యే సహకారాన్ని అందిస్తున్నారు. మునగపాకకు చెందిన డాన్ జిమ్ అధినేతలు పెంటకోట విజయ్, అజయ్ సోదరులు తమవంతు సాయంగా రూ.50 వేల విరాళాన్ని కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ కర్రి సాయికృష్ణ, ఆడారి సూర్యచంద్రరావు, ఆడారి గంగమహేష్, విల్లూరి సోమునాయుడు, పాలమరశెట్టి సీతారామరాజు, పెంటకోట శివ గణేష్ పాల్గొన్నారు.



పాయకరావుపేట మండలంలో రాత్రిపూట విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పేరెంట్స్‌కు అవగాహన కల్పిస్తున్న డీవైఈవో అప్పారావు

ఫలితం పదింతలొచ్చేలా..

- మెరుగైన ఫలితాల కోసం చర్యలు
- 10/10 సాధించడమే లక్ష్యం
- వెనుకబడిన వారికోసం ప్రత్యేక తరగతులు
- తల్లిదండ్రులతో సమావేశాలు
- రాత్రిపూట ఇళ్లకు వెళ్లి అవగాహన



స్టడీ అవర్స్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో నరేష్

నక్కపల్లి: ఈ ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యా శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం నెల రోజుల ముందు నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే మార్చి17 నుంచి 30వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ షెడ్యూలు విడుదల చేసింది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులతో పాటు, పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం పాఠశాలలు పనివేళలు ముగిసిన తర్వాత ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలతోపాటు హాస్టళ్లలో చదివే విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. రాత్రిపూట ఇళ్ల వద్దకు వెళ్లి పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఏ విధంగా ప్రిపేర్ అవుతున్నారనే దానిపై పరిశీలన చేస్తున్నారు. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

మంచి భవిష్యత్ కోసం స్వీయ మదింపు...

సెల్ఫ్ (సెల్ఫ్ ఎవాల్యుయేషన్ అండ్ లెర్నింగ్ ఫర్ ఫ్యూచర్) మంచి భవిష్యత్ కోసం స్వీయ మదింపు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. ఈ విధానం ద్వారా డీసీ బోర్డు వారు రూపొందించిన ఒక ప్రశ్న పత్రాన్ని(20 మార్కులతో) ప్రతి రోజు ఉపాధ్యాయుల వాట్సాప్‌కు పంపించి దానిపై విద్యార్థుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ప్రతి సబ్జెక్ట్‌కు ఈ ప్రశ్న పత్రంతో పరీక్ష నిర్వహిస్తున్నారు. ఏడాదికి 4 ఫార్మెటివ్, 2 సమ్మెటివ్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 2 ఫార్మెటివ్ ఒక సమ్మెటివ్ పరీక్షలు పూర్తయ్యాయి. ఫిబ్రవరి చివరలో రెండు విడతలుగా ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

మండలం	హైస్కూళ్ల సంఖ్య	టెన్త్ రాసే విద్యార్థులు
నక్కపల్లి	14	956 మంది
పాయకరావుపేట	12	712 మంది
ఎస్. రాయవరం	15	644మంది
కోటవురట్ల	06	432 మంది



పరీక్ష రాయబోయే విద్యార్థులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి, మండల విద్యా శాఖాధికారి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాఠశాల పరిసర గ్రామాల్లో నివసిస్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడటం, విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు, పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు అనుకూలమైన వాతావరణం ఉందా లేదా అనేది పరిశీలిస్తున్నారు. మొత్తం మీద పదో తరగతిలో శతశాతం మార్కులు తెచ్చుకుని మంచి ఫలితాలు సాధించే దిశగా విద్యా శాఖ, ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని

పాఠశాల పనివేళలు ముగిసిన తర్వాత ఇళ్లకు వచ్చిన విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్‌లతో కాలక్షేపం చేయకుండా కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత పరీక్షలకు ప్రిపేర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నారు. ఇదే కాకుండా పాఠశాలల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహిస్తున్నారు. బాగా వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని వారిని పరీక్షలకు బాగా చదివే విద్యార్థులతో పోటీ పడే విధంగా ప్రత్యేక బోధన చేస్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని వారు ఉదయం ఎన్ని గంటలకు నిద్రలేస్తున్నారు. వారి దిన చర్య ఏంటి, రాత్రి ఎన్ని గంటల వరకు ప్రిపేర్ అవుతున్నారు. అనే వివరాలు వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి కనుక్కోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం విద్యా నిపుణులతో రూపొందించిన అకడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా సిలబస్ బోధన జరుగుతోంది. డిసెంబరు నాటికి సిలబస్ పూర్తి చేశారు. ప్రస్తుతం రివిజన్ జరుగుతోంది.



దేవవరం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం స్టడీ అవర్స్

మంచి మార్కులు తెచ్చుకుంటా



స్కూల్లో ఉదయం, సాయంత్రం వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు పెడుతున్నారు. మాకు సందేహాలు ఉంటే ఆ సమయంలో నివృత్తి చేసుకుంటున్నాం. రాత్రిపూట టీచర్లు మా ఇళ్లకు వచ్చి ఎలా చదువుతున్నామో ఆరా తీస్తున్నారు. సిలబస్ పూర్తయింది. ప్రస్తుతం రివిజన్ జరుగుతోంది. మంచి మార్కులు తెచ్చుకుంటామనే నమ్మకం ఉంది.

– అయితా జోత్స్న, టెన్త్ విద్యార్థిని, దేవవరం

స్టడీ అవర్స్ వల్ల భయం పోయింది



మా స్కూల్లో ఉపాధ్యాయులు బాగా బోధిస్తున్నారు. సిలబస్ పూర్తయింది. పబ్లిక్ పరీక్షలకు ఇంకా 45 రోజుల సమయం ఉంది. అయినప్పటికీ రెండు పూటలా స్టడీ అవర్స్ పెట్టడం వల్ల మాలో భయం పోయింది. క్లాస్‌లో చెప్పినా పాఠాల్లో డౌట్లు ఉంటే స్టడీ అవర్స్‌లో తెలుసుకుంటున్నాం. మంచి మార్కులు సాధించే దిశగా చదువుకుంటున్నాం.తప్పకుండా సాధించి తీరుతాం.

– అల్లు లోవ, టెన్త్ విద్యార్థి, దేవవరం

మెరుగైన ఫలితాలు సాధించేందుకు చర్యలు

పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నాం. సెల్ఫ్ విధానం ద్వారా రోజూ విద్యార్థులకు ప్రతి సబ్జెక్ట్‌పైన 20 మార్కులతో కూడిన టెస్ట్ నిర్వహిస్తున్నాం. ప్రతి ఉపాధ్యాయుడు బాగా వెనుకబడిన ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని వారికి మంచి తర్ఫీదు ఇచ్చేలా చర్యలు చేపట్టాం. రెండు పూటలా అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. రాత్రి పూట ఇళ్ల వద్ద తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి ప్రిపేర్ అయ్యేందుకు అవసరమైన వాతావరణం కల్పించాలి.

– కుంచం నరేష్, ఎంఈవో, నక్కపల్లి

నేత్రపర్వంగా భావనారుషి కల్యాణం

అంగరంగ వైభవంగా శూలాల సంబరం



చుక్కలవాని లక్ష్మీపురంలో భావనారుషి కల్యాణం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి: మండలంలో ప్రఖ్యాత గాంచిన చుక్కలవాని లక్ష్మీపురంలో భద్రావతి సమేత భావనారుషి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. శూలాల సంబరాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన పద్మశాలీ సోదరులు ఏటా మాఘ మాసంలో ఈ వేడుకను వైభవంగా నిర్వహిస్తారు. సోమవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు పుష్పాలంకరణ, కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం విబూది పండ్లు ఊరేగింపు జరిగింది. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. తదుపరి భజన కార్యక్రమం జరిగింది. సాయంత్రం 3 గంటలకు అమ్మవారి పుట్టింటి సారె ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు కోలాటం ఏర్పాటు చేశారు. తదుపరి నగర సంకీర్తన దీపోత్సవం జరిగింది. రాత్రి 7 గంటలకు అశ్వరథ ప్రతి కార్యక్రమం, మెగా డాన్స్ నిర్వహించారు. రాత్రి 12 గంటలకు శూలాల సంబరం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పద్మశాలీ భక్తులు శూలాలు నాలుకపై గుచ్చుకుని ప్రభలు పట్టుకుని నృత్యాలు చేస్తూ తెల్లవార్లు జాగరణ చేస్తూ ఊరేగింపు జాతర నిర్వహించారు. ఈ సంబరాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు తరలివచ్చారు. గ్రామంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీకరణ ఆకట్టుకుంది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ కర్రి గీతా రాజబాబు ఆధ్వర్యంలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్యంతో ఉన్నత జీవితం సాధ్యం

నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మాజీ వైస్ చాన్సలర్ ముత్యాలనాయుడు

కోటవురట్ల: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో చదివితే ఉన్నత జీవితం సాధ్యపడుతుందని నన్నయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముర్రు ముత్యాలనాయుడు అన్నారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేసేలా విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. సత్యసాయి సేవా సమితి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ అల్లావుద్దీన్, ఎంపీటీసీలు కాళ్ల రత్నం, యలమంచిలి ప్రకాష్, మాజీ సర్పంచ్ కాళ్ల శ్రీనివాసరావు, గ్రామ నాయకులు తిరుమలరావు, పైల నాని, కాళ్ల మాతునాయుడు, ఎస్‌ఎంసీ చైర్మన్ శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి సన్యాసినాయుడు

అచ్యుతాపురం: పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నాయుడుబాబుల ఆధ్వర్యంలో బీజేపీ మండల నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా చుక్కా అనురాధ, ఉపాధ్యక్షులుగా కర్రి వెంకట సోమునాయుడు, యండపల్లి రాజు, శనివాడ రాంబాబు, పెంటకోట జయ అప్పారావు, తుమ్మల గణేశ్‌కుమార్, పిన్నమరాజు చిరంజీవి, కార్యదర్శులుగా దేశంశెట్టి కాసుబాబు, మట్టా లక్ష్మి, తురాయి శ్రీరాములు, చిన్న రమణ, చందా మసిలినాయుడు, అడిగర్ల రాజు, కోశాధికారిగా రాజాన శ్రీను, యువ మోర్చా అధ్యక్షుడిగా శీరా చిరంజీవి, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పంచదార్ల కుమారి దేవి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా మట్టా నూకరాజులను ఎన్నుకున్నారు. వీరందరినీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు సన్యాసినాయుడు అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో పీఆర్టీయూ మిత్ర సంఘాల అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు ఓటు వేయాలని పీఆర్టీయూ నాయకులు శ్రీనివాసరావు, చోడిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలో పలు గ్రామాల్లో సోమవారం రాత్రి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయులు ప్రకాష్, శ్రీను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది



హరిపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి మానస



పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి సౌందర్య



పిల్లలకు మాత్రలు మింగిస్తున్న ఎంపీడీవో ఉషారాణి



చినబొడ్డేపల్లిలో పిల్లలకు మాత్రను మింగిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు

నక్కపల్లి: మండలంలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సోమవారం నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. స్థానిక బాలికల పాఠశాలలో ఎంపీడీవో సీతారామరాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ నులిపురుగు నిర్మూలనలో భాగంగా మాత్రలు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.76 అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,356 మంది చిన్నారులకు, 75 ప్రభుత్వ పాఠశాలల్లో 8,112 మంది విద్యార్థులకు, 2,056 మంది ప్రైవేటు స్కూలు విద్యార్థులకు మొత్తం14,578 మందికి వీటిని మింగించామన్నారు. వైద్యాధికారి సుకన్య, ఎంఈవో కే నరేష్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

పాయకరావుపేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో 97 శాతం పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యులు సుభాష్, సౌందర్య తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో 14,172 మంది పిల్లలకు గాను 13,859 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామన్నారు. మిగిలిన పిల్లలకు వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి అందిస్తారన్నారు. వైద్య సిబ్బంది ఈ.రమణ, హెచ్‌ఎస్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: హరిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మానస మాట్లాడుతూ విద్యార్థులకు రక్తహీనత నివారణకు ఈ మాత్రలు దోహదం చేస్తాయన్నారు. కడుపులోని నులిపురుగుల్ని నివారిస్తాయని తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 3,264 మందికి వీటిని వేశామని తెలిపారు. హెచ్‌ఎం శ్రీపాద రవి, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉపాధ్యయులు గాంధీ, అనురాధ, హైమావతి, రమణి, నిషా, ఏఎన్‌ఎం వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు మంగమ్మ, శ్యామల పాల్గొన్నారు.

మునగపాక: నులిపురుగుల నివారణ మాత్రలు ప్రతీ ఆర్నెల్లకోసారి వేసుకోవాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి కోరారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. నివారణకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా ప్రవళిక, హెచ్‌ఎం శ్రీనివాసరావు, సీహెచ్‌వో దేవకాంత, ఏఎన్‌ఎం దేవకి పాల్గొన్నారు.

కోటవురట్ల: ఙమండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. చినబొడ్డేపల్లిలోని ఎంపీపీ స్కూల్‌లో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు విద్యార్థులకు మాత్రలు మింగించారు. ఆయన మాట్లాడుతూ పిల్లల్లో రక్తహీనతను పారదోలేందుకు నులిపురుగుల నివారణకు వీటిని మింగించాలన్నారు.

చలానాలు కట్టకపోతే వాహనం సీజ్

పట్టణ ఎస్సై సావిత్రి హెచ్చరిక



యలమంచిలి రూరల్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ ఎస్సై కె సావిత్రి స్పష్టం చేశారు. సోమవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడుతూ చలానాలు కట్టకుండా తప్పించుకు తిరుగుతున్న వాహనదారులపై చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామన్నారు. పట్టణ పరిధిలో తిరుగుతున్న వాహనాలపై సుదీర్ఘకాలంగా పెండింగ్ చలానాలు ఉంటే, ఆయా వాహనాలను స్వాధీనపర్చుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా చలానాలు చెల్లించాల్సిందేనన్నారు. తమ తనిఖీల్లో పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పెండింగ్ చలానాలను ఫోన్‌లోనే చెల్లించే అవకాశం ఉందన్నారు.

తడిపొడి చెత్త ఏరివేతపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి రూరల్: పురపాలక సంఘం పరిధిలో స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ యలమంచిలి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఆధ్వర్యంలో తడిపొడి చెత్త ఏరివేతపై సోమవారం అవగాహన కల్పించారు. మున్సిపల్ గ్యారేజీ ఆవరణలో జరిగిన ఈ సమావేశంలో శానిటరీ సిబ్బందికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ముందు పైలట్ ప్రాజెక్ట్‌గా పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో ఈ కార్యక్రమాన్ని చేపట్టగా విజయవంతమైందన్నారు. తాను, కమిషనర్ కూడా రోజూ ఒక్కో వార్డులో పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. దీనికి సిబ్బంది, అధికారులు, ప్రజలు సహకరించాలన్నారు. కమిషనర్ బీజేఎస్ ప్రసాద్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అచ్యుతాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక సందడిగా జరిగింది. అప్పటి ఎస్పీఎల్ పెద్దింటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో సీతపాలెం సముద్ర తీరాన విద్యార్థులందరూ సమావేశమయ్యారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో వయస్సు మరచిపోయి ఒక్కసారిగా చిన్న పిల్లలుగా మారిపోయారు. ఆనాటి సరదాలు, సందళ్లు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమం మేరుగు బాపునాయుడు, ద్వారపురెడ్డి బుచ్చి అప్పారావు, రుత్తల గిరిబాబు, గుడాల శ్రీహరి, రుత్తల శ్రీను, దేశంశెట్టి శ్యామల, బొండు ముత్యాలు, రెడ్డి రమణల ఆధ్వర్యంలో నిర్వహించారు.